క్లుప్తంగా

క్రికెట్ పోటీలు



అయిజ: మండలంలోని బింగుదొడ్డిలో సంక్రాంతి పండగ సందర్భంగా క్రికెట్ పోటీలు ప్రారంభించారు. విజేతలకు మొదటి బహుమతి రూ.10,016, రెండో బహుమతి రూ.5016లు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డుకు అడ్డంగా విద్యుత్ స్తంభం



మానవపాడు: మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్‌కు వెళ్లే ప్రధాన రహదారి రోడ్డుమార్గంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి అడ్డంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి గుంతల మయం



మానవపాడు: మండలంలోని చెన్నిపాడు నుంచి మానవపాడుకు వెళ్లే రహదారి గుంతలమయంగా తయారైంది. జిల్లా అధికారుల ఆదేశానుసారం రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మానవపాడు నుంచి చెన్నిపాడుకు వెళ్లే రహదారిలో అసంపూర్తి పనులతో నిర్మాణాలు చేపడుతున్నారని చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గడ్డివాములు దగ్ధం



ఉండవెల్లి: మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీలోని వడ్డోన్ గుంత సమీపంలో పశువుల కోసం కల్లెందొడ్డిలో నిల్వ చేసిన గడ్డివాములను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున మూడుచోట్ల ఉన్న గడ్డివామును గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో దట్టమైన పొగలు రావడంతో చూసిన యువకులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. దీంతో రూ.లక్ష విలువైన గడ్డి కాలిపోయిందని పాడి రైతులు కురుమూర్తి, స్వాములు తెలిపారు. మంటలను అదుపు చేయడంలో అగ్నిమాపక సిబ్బంది కురుమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

19న జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఎన్నిక

గద్వాలటౌన్: రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈ నెల 19న 10 గంటలకు స్థానిక ఎస్వీ ఈవెంట్ హాల్లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సాధారణ సమావేశం ఏర్పాటు చేసినట్లు అసోసియేషన్ చైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి, కన్వీనర్ అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకుంటామన్నారు. సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

మూగజీవాలపై దాడి



అయిజ: మండలంలోని బింగుదొడ్డి గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన వీరుపాక్షి ఆవేశంతో రెండు గొర్రెలను చంపాడు. సోమవారం వీరుపాక్షి పంటపొలంలో గొర్రెలు కనపడడం చూసి అక్కడే ఉన్న గొర్రెల కాపరి రాముడిపై దాడి చేసేందుకు వెళ్లాడు. అక్కడ నుంచి గొర్రెల కాపరి పారిపోయాడు. ఆవేశంలో అక్కడ ఉన్న రెండు గొర్రెలను కర్రతో బాది చంపేశాడు. రాముడు పోలీస్ స్టేషన్‌లో వీరుపాక్షిపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పంచనామా చేసి కేసు నమోదు చేశారు. సంఘటనపై విచారణ చేస్తామని ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు.

పల్లెల్లో సందడే సందడి

భోగి మంటలు, ముంగిట్లో ముగ్గులు

అలంపూర్: సంక్రాంతి సంబురాలు అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. నియోజకవర్గంలోని ప్రజలు సంక్రాంతి పండగను మూడు రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. సంక్రాంతి తొలిరోజు పల్లెల్లో వాడవాడనా భోగి సంబరాలు నిర్వహించారు. మున్సిపాలిటీలు, పట్టణాలు, గ్రామాల్లో సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆటలపోటీలు, ముగ్గుల పోటీలు నిర్వహించారు. అలంపూర్ పట్టణంలో వివేకానంద యూత్ సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పుల్లూరు తదితర గ్రామాల్లో క్రీడా పోటీలు ప్రారంభించారు.

రంగు రంగుల రంగవల్లులు

ఉండవెల్లి: మండలంలోని భోగి సందర్భంగా అన్ని గ్రామాల్లో తెల్లవారుజామున భోగి మంటలతో కుటుంబ సభ్యులు, యువత ఉత్సాహంగా నిర్వహించారు. మహిళలు రంగు, రంగుల రంగవల్లికలతో ముగ్గులతో రోడ్లన్నీ నింపేశారు.

- రాజోళి మండల కేంద్రం, ఆయా గ్రామాల్లో భోగి పండగ సందర్భంగా ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి, గొబ్బెమ్మలు పెట్టి పూజించారు.
- అయిజ మండల కేంద్రంలో, వివిధ గ్రామాల్లో సంక్రాంతికి ముందురోజు భోగి పండగను ప్రజలు సంప్రదాయపరంగా నిర్వహించారు. భక్తులు వివిధ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.



గద్వాల పట్టణంలో భోగి మంటలు వేస్తున్న ప్రజలు

- కేటీదొడ్డి మండలంలో మహిళలు, యువతులు ఇళ్లముందు రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో భోగి సంబరాలు నిర్వహించారు.
- మల్దకల్ మండలంలో మహిళలు రంగురంగుల ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన మహిళలకు బహుమతులను ప్రదానం చేశారు
- ధరూరు మండలంలో మహిళలు, యువతులు ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో గ్రామాల్లో కొత్త కాంతులు కనిపించాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- శాంతినగర్, వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండలంలోని ఆయా గ్రామాల్లో ఉల్లాసంగా భోగి మంటలు వేసుకుని పండగకు ఆహ్వానం పలికారు. కీడు తొలగించుకోవడానికి రేగిపళ్లు, నువ్వుల నూనె, నువ్వుల పొడితో పవిత్ర స్నానాలు ఆచరించారు.
- గట్టులో ఇళ్లలోని పాత వస్తువులు తీసుకొచ్చి భోగి మంటలు వేసి, ప్రదక్షిణలు చేశారు. వీధుల్లో రకరకాల ముగ్గులను వేశారు. భోగి రోజున చిన్నారులపై రేగిపళ్లను వేశారు.



ఉండవెల్లిలో ముగ్గు వేస్తున్న చిన్నారి



ధరూరులో ముగ్గు వేసి రంగులు వేస్తున్న యువతి



శాంతినగర్‌లో ముగ్గు వేస్తున్న యువతి



కట్టకింది తిమ్మప్ప స్వామి ఆలయంలో పూజలు



రాజోళిలో..



అమరవాయిలో..

విజేతలకు బహుమతుల ప్రదానం



వావిలాలలో బహుమతును ప్రదానం చేస్తున్న నిర్వహకులు

ఇటిక్యాల: మండలంలోని వావిలాల గ్రామంలో శ్రీ శివాంజనేయస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో చుట్టు పక్కల పరిసర ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు. పోటీలో గెలుపొందిన ఐదుగురు మహిళలు లత, లావణ్య, జ్యోతి, అపర్ణ, రాజేశ్వరిలకు ఆలయ కమిటీ నిర్వహకులు, గ్రామ పెద్దలు బహుమతులు అందజేశారు. రాత్రి అంతర్రాష్ట్ర భజన పోటీలో 13 భజన బృందాలు పాల్గొనగా, గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక పూజలు

కృష్ణా: మండల కేంద్రంలోని శ్రీ క్షీరాలింగేశ్వర ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామివారికి అలంకారం, క్షీరాభిషేకం తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హిందుపూర్ వెంకన్నగౌడ్ ఇంటి నుంచి కలశం, స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లారు. సాయంత్రం ప్రభోత్సవం వందలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

గోదాదేవి కల్యాణోత్సవం



వనపర్తి రూరల్: మండలంలోని చిమనగుంటపల్లి శివారులో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవాన్ని సోమవారం ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యాచారి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పట్టువస్త్రాలతో అలంకరించి వేద పండితుల మంత్రోచ్ఛరణలతో స్వామివారికి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పంటలు ఎండుతున్నాయ్!

- రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు అందని సాగునీరు
- ఎండు ముఖం పడుతున్న జొన్న, మొక్కజొన్న, మిరప
- ఆర్‌డీఎస్ ఆయకట్టుపై రైతులకు తప్పని నీటి కష్టాలు
- మరో నెల రోజులు తడులు అవసరమంటున్న రైతులు



వడ్డేపల్లి మండలం కోవులదిన్నె శివారులో ఎండుముఖం పట్టిన మొక్కజొన్న



తుమ్మిళ్ల లిఫ్ట్ దగ్గర నీటి విడుదల చేయాలని నిరసన చేస్తున్న రైతులు

రాజోళి: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. వానాకాలం సీజన్‌లో వేసిన పంటలు కొంత దెబ్బతిని నష్టం చవిచూసినప్పటికీ, యాసంగిలో పలు పంటలు సాగు చేసుకుని ఆ నష్టాల నుంచి బయటపడేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. వాటికి తోడు ఆర్‌డీఎస్‌లో సరైన నీటి లభ్యత లేని కారణంగా పంటలు ఎండుముఖం పడుతున్నాయి. దీంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలో అధిక శాతం ఆర్‌డీఎస్ నీటిపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తారు. కొన్నేళ్లుగా ఆర్‌డీఎస్ సమస్య వేధిస్తున్నప్పటికీ, వారబందీలు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా నీటిని వాడుకుని పంటలకు అందిస్తున్నారు. గత నాలుగేళ్లుగా తుమ్మిళ్ల ఎత్తిపోతల రావడంతో ఆర్‌డీఎస్ చివరి ఆయకట్టు వరకు పూర్తి స్థాయిలో కాకపోయినా కొంత నీరు రావడంతో పంటలు సాగు చేస్తున్నారు.

వారం రోజులుగా నిలిచిన నీరు..

ఆర్‌డీఎస్ నీటిపై ఆధారపడి వేల ఎకరాలు సాగు చేస్తున్న క్రమంలో ప్రస్తుతం ఆర్‌డీఎస్‌లో వారం రోజులుగా నీరు నిలిచిపోయింది. సరిగ్గా నీటి తడులు అవసరమున్న సమయంలో కెనాల్ బంద్ కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరో నెల రోజుల దాకా పంటలకు తడులు అవసరముంటుంది. వారం నుంచి స్థానిక అధికార, ప్రతిపక్ష నాయకులు నీటి విడుదల చేయించాలని చెబుతున్నా, ఇంతవరకు చుక్క నీరు కూడా కెనాల్‌లో కనిపించడం లేదు. తుమ్మిళ్ల మోటార్లు ఆన్ చేస్తే సాగునీరు అందే అవకాశం ఉంది.

రైతుల నిరసన..

ఆర్‌డీఎస్ కెనాల్‌లో నీరు రాకపోవడంతో రైతులు శుక్రవారం తుమ్మిళ్ల లిఫ్ట్ దగ్గర నిరసన తెలిపారు. కెనాల్‌లో నీరు రాకపోతే పంటలు ఎండుతున్నాయని, దీని వల్ల లక్షల రూపాయలు నష్టపోయి, అప్పులపాలు అయ్యి, ఆత్మహత్యలే శరణ్యమంటున్నారు. వెంటనే నీరు విడుదల చేయకపోతే పెద్ద ధర్నాలు తప్పవని హెచ్చరించారు. ఆర్‌డీఎస్ అధికారులు దీనిపై దృష్టి పెట్టి సాగునీరు అందించాలని కోరారు.

మరో నెల రోజులు తడులు అవసరం



ప్రస్తుతం సాగు చేస్తున్న పంటలకు మరో నెలరోజుల పాటు నీటి తడులు అవసరమున్నాయి. ఇప్పటికే సాగు చేసిన పంటలు మొత్తం ఎండు దశలో ఉన్నాయి. ఇప్పుడు నీరు అందకపోతే మిరప, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా ఎండిపోతాయి. కెనాల్‌పై ఆధారపడిన రైతుల పరిస్థితి ఇబ్బందిగా మారింది. – పరుశరాముడు, రైతు, తుమ్మిళ్ల

పెద్ద మొత్తంలో నష్టం తప్పదు

సరిగ్గా సాగు నీరు అందించే సమయమిది. ఈ సమయంలో నీరు అందకపోతే చేతికొచ్చే పంటలు మొత్తం నాశనమవుతాయి. మిరప పంటకు లక్షల రూపాయల పెట్టుబడి పెట్టాం. ఇప్పుడు పంటలకు తడులు అందించలేకపోతే పెద్ద మొత్తంలో రైతులు నష్టపోవాల్సి ఉంటుంది. అధికారులు, నాయకులు త్వరగా నీటిని అందించి ఆయకట్టు రైతులను ఆదుకోవాలి. – సునీల్, రైతు, శాంతినగర్

నీటిని విడుదల చేయించాం

కర్ణాటక పరిధిలో ఉన్న హొస్పేట్ నుంచి నీటిని విడుదల చేయించాం. రెండు రోజుల క్రితం నీటి విడుదల చేశారు. రైతులకు వీలైనంత త్వరగా సాగు నీరు అందించేకు కృషి చేస్తున్నాం. పై అధికారులు కూడా నీటి విడుదలపై క్రమం తప్పకుండా కో ఆర్డినేట్ చేస్తున్నారు. – వరుణ్, ఆర్‌డీఎస్ ఏఈఈ

ఆర్డీఎస్ రైతులకు నీరందేలా చూస్తాం

తెలుగు రాష్ట్రాల ఈఎన్‌సీలతో మాట్లాడిన మంత్రి జూపల్లి

అలంపూర్: ఆర్డీఎస్ రైతులకు నీరందించేందుకు చర్యలు చేపడతామని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. హైదరాబాదులో మంత్రి జూపల్లి కృష్ణారావును ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ సోమవారం కలిసినట్లు తెలిపారు. తుమ్మిళ్ల రైతులకు సాగునీటి కష్టాలను మంత్రికి వివరించినట్లు తెలిపారు. దీంతో మన రాష్ట్ర ఈఎన్‌సీతో పాటు ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీతో మంత్రి ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. ఆర్డీఎస్ సమస్యను ప్రధానంగా చూడాలని ఈఎన్‌సీలకు సూచించిట్లు తెలిపారు. రాత్రి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలవనున్నట్లు సంపత్‌కుమార్ తెలిపారు. ఒకటి లేదా రెండు రోజుల్లో తుమ్మిళ్ల ద్వారా సాగు నీరు అందించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



ఈఎన్‌సీతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

రైతులు అధైర్యపడొద్దు

అలంపూర్: ఆర్డీఎస్ రైతులు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ వెంకటేశ్వరరావుతో ఎమ్మెల్యే సోమవారం ఫోన్‌లో మాట్లాడినట్లు తెలిపారు. నాలుగు రోజులుగా ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆయనకు వివరించినట్లు తెలిపారు. రైతుల సమస్యను ఎప్పటికప్పుడు ప్రభుత్వ ఉన్నత అధికారులకు వివరిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. సాగు నీరు అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, రైతులు అధైర్యపడొద్దని తెలిపారు. పంటలు నష్టపోకుండా సాగు నీరు అందించడానికి కృషి చేస్తానని తెలిపారు.



ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉండవెల్లి: మండలంలోని ప్రాగటూరు గ్రామంలో చేనేత అభయహస్తం అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో చేనేత సంఘం ఆధ్వర్యంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపాల్, దస్తగిరి, చేనేత క్లస్టర్ చైర్మన్ మహేష్, వైస్ చైర్మన్ రాము, నాయకులు రమేష్, నరేందర్ నాయుడు, మద్దిలేటి, మల్లేష్, శేఖర్, మోహన్, రవి, చాంద్, తదితరులు పాల్గొన్నారు.



ప్రాగటూరులో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న చేనేత సంఘం, కాంగ్రెస్ నాయకులు

కనులపండువగా ఆదిశిలావాసుడి కల్యాణం



ఆదిశిలా క్షేత్రంలో శ్రీనివాసుడి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు రమేషాచారి, మధుసూదనాచారి, రవిచారిలు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాహోమం నిర్వహించి స్వామివారి ఉత్సవమూర్తులకు కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రహ్లాదరావు, చంద్రశేఖర్‌రావు, దీరేంద్రదాసు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధన్వంతరి వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అయిజ: పౌర్ణమిని పురస్కరించుకొని మండలంలోని ఉత్తనూరులో సోమవారం ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై ఊరేగించారు. స్వామివారి కల్యాణానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. స్వామి వారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం ఏర్పాటు చేశారు.



స్వామివారి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మందా జగన్నాథం చిత్రపటం వద్ద నివాళి

అయిజ: మాజీ ఎంపీ మందా జగన్నాథం మృతి పట్ల వివిధ పార్టీలు, సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ వద్ద మందా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో మందా జగన్నాథం కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, ఆర్.శ్రీధర్, శేషన్న, విజయభాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్, మల్లికార్జున్ మారెప్ప, మద్దిలేటి, గాలిరెడ్డి, మాదన్న, రాజేష్, నరసింహులు, భీమన్న, ఆనందరాజు, వేమయ్య, తిమ్మప్ప, రాజు, ఇమ్మానియేల్, వెంకటేష్, కృష్ణ, తిమ్మప్ప, సామేలు, దేవన్న, సునంద, మంగళి మహేష్ పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మృతికి సంతాపం

గద్వాలటౌన్: నాగర్‌కర్నూల్ మాజీ పార్లమెంట్ సభ్యుడు మంద జగన్నాథం మృతికి పలువురు రాజకీయ నాయకులు వేర్వేరుగా సంతాపం తెలిపారు. మంద జగన్నాథం మరణం నడిగడ్డకు తీరని లోటని మాజీ కౌన్సిలర్, సీనియర్ నాయకుడు భీంసేన్‌రావు చెప్పారు. వైద్యుడిగా సేవలు అందించిన ఆయన రాజకీయాల్లో ప్రవేశించి నాలుగుసార్లు ఎంపీగా గెలుపొందారన్నారు. అనతి కాలంలోనే మంచి రాజకీయ గుర్తింపు సాధించారని కొనియాడారు.



అయిజలో మందా జగన్నాథం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కబడ్డీతో శారీరక వ్యాయామం లభిస్తుంది

వీపనగండ్ల: యువకులు కబడ్డీ పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక వ్యాయామం లభించి వారి సృజనాత్మతను పెంచుతుందని ఎస్‌ఐ కె రాణి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బాల్‌రెడ్డి అన్నారు. గోవర్ధనగిరి గ్రామంలో సోమవారం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను వారు ప్రారంభించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలన్న సదుద్దేశంతో కబడ్డీ పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ అంశం అని వారు అన్నారు. క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారు అన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం ఆది, డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు మహేష్, నాయకులు మహబూస్‌సాని, ముంత వెంకటస్వామి, రవిప్రసాద్, ఖాజా ఉస్సేన్, పెద్ద ఖాజ, మద్దిలేటీ, మౌలాలీ, గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు వెంకటస్వామి, మహేశ్వర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, నాగన్న తదితరులు పాల్గొన్నారు.



గోవర్ధనగిరిలో కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌ఐ కె రాణి

ట్రాక్టర్ రివర్స్ పోటీలు

నర్వ: సంక్రాంతి సంబరాల్లో భాగంగా లంకాల్ గ్రామంలో ట్రాక్టర్ రివర్స్ గేర్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 69 ట్రాక్టర్లు, డ్రైవర్లు పోటీలో పాల్గొని ఉత్సాహంగా పోటీపడ్డారు. ఇందులో ప్రథమ బహుమతి విజేత వీరపట్నం వెంకటేష్‌కు 5 తులాల వెండి, ద్వితీయ బహుమతి విజేత దుప్పల్లి వెంకటేష్ 4 తులాల వెండి, మూడో బహుమతి విజేతకు పల్లెగడ్డ రవికి 3 తులాలు వెండిని బహుమతిగా అందజేశారు. దాత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బీసం చెన్నయ్యసాగర్ బహుమతుల ప్రదానం చేశారు. గ్రామస్తులు కొట్ల శ్రీనువాసులు, పాండు, తదితరులు పాల్గొన్నారు.